క్లుప్తంగా

పిల్లల పట్ల శ్రద్ధ వహించండి



యండపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. యండపల్లిలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాక్ పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : గంగాదేవిపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే రోజు రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

కొత్తమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం : మండలంలో వెంకటాపురం గ్రామంలో కొత్తమ్మతల్లి జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామ ఇలవేల్పుగా పిలువబడే ఈ అమ్మవారి జాతరను ఆచార సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు అమ్మవారి జాతర గురువారం వేకువజాము నుంచి నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు గ్రామంలో భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.

26న మండల పరిషత్ సమావేశం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు అచ్యుతాపురం మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల శాఖ అధికారులు, మండల పరిషత్ సభ్యులు హాజరు కావాలని ఆమె సూచించారు.

నీతి పద్యాల పఠనం



నీతి పద్యాలను వల్లెవేస్తున్న చిన్నారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం చిన్నారులకు నీతి పద్యాలు నేర్పించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థిని విజయలక్ష్మి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి చిన్నారులకు నీతి పద్యాల అర్థాన్ని వివరించారు. దేశభక్తి గీతాలను పాడించారు.

ఎండు గడ్డి కుప్ప దగ్ధం

మునగపాక : మునగపాకలోని ఆంజనేయ స్వామి భవనం ఆవరణలో ప్రమాదవశాత్తూ ఎండుగడ్డి కాలి బూడిదైంది. వివరాలిలా ఉన్నాయి. మునగపాక ఆభయాంజనేయ స్వామి భవనం పక్కనే తోడపెద్దు మేతకు సంబంధించి ఎండుగడ్డి కుప్ప ఉంది. బుధవారం సాయంత్రం ఎండుగడ్డి కుప్పపై నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో గడ్డి కుప్ప దగ్ధం అయింది. విషయం తెలుసుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి బి.నరసింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.30వేల మేర ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

తేలికపాటి చినుకులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం తేలికపాటి చినుకులు పడ్డాయి. మధ్యాహ్నం 4వరకు భానుడు భగభగలతో అల్లాడిన జనం ఆ తర్వాత వాతావారణం మారడంతో వర్షం పడుతుందని ఆశించారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు దర్శనమిచ్చాయి. వర్షం మాత్రం చినుకులకే పరిమితమైంది.

పశుబీమాతో రైతుకు ధీమా

- జూన్ 1 నుంచి ప్రారంభం
- మూడేళ్ల పాటు వర్తింపు
- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న అధికారులు



బీమా చేయించుకునే పశువులకు ట్యాగ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : పాడిపశువులకు ప్రభుత్వం కల్పిస్తున్న పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు సోకి పశువులు చనిపోతే రైతు నష్టపోకుండా ఉండేందుకు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. నూతన విధానంతో ఈ బీమా పథకం వచ్చే జూన్ నుంచి ప్రారంభం కానుంది. రైతులు కూడా కొంత మొత్తాన్ని ప్రీమియంగా చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరించి పశువులకు బీమా చేయిస్తుంది. ఈ పథకం కింద తెల్లకార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 20 శాతం దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల పాటు ఈ బీమా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నెలలు, సంవత్సరాల పాటు కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజుల్లోగా బీమా పరిహారం రైతుల ఖాతాలో జమ అవుతుంది.

రాయితీతో కూడిన ప్రీమియం

దేశవాళి, సంకర జాతి ఆడ మగ పశువుకు తెల్లకార్డులేని వారయితే రూ.30 వేలకు రైతు తన వాటా కింద రూ.960 చెల్లించాలి. తెల్లకార్డు కలిగిన వారు, ఎస్సీ, ఎస్టీ రైతులయితే రూ.384 చెల్లించాలి. నాటు జాతికి చెందిన ఆడ మగ పశువులకు రూ.15వేలు బీమా మొత్తానికి తెల్లకార్డు లేనివారు రూ.480, తెల్లకార్డు కలిగిన రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.192లు చెల్లించాలి. ఇక గొర్రె, మేక, పందులకు ఒక సంవత్సరం కాలపరిమితికి రూ.6వేలు బీమా మొత్తానికి తెల్లకార్డు కలిగిన వారు రూ.36, తెల్లకార్డులేని వారు రూ.90 ప్రీమియం చెల్లించాలి. ఇవే జీవాలకు రెండేళ్ల కాలపరిమితికి తెల్లకార్డు కలిగిన వారు రూ 54, తెల్లకార్డులేని వారు రూ.135 చెల్లించాలి. మూడేళ్ల కాలపరిమితికి ఇదే బీమా మొత్తానికి తెల్లకార్డు ఉన్నవారు రూ.75, లేని వారు రూ.187.50 చెల్లించాలి. లబ్ధిదారు తాము బీమా చేయించిన పశువులను విక్రయిస్తే ఆ వివరాలు ఏడు రోజుల్లోగా పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలియజేస్తే ఈ పాలసీని కొత్త యజమానికి వర్తింపజేసేలా కార్యాచరణ రూపొందించారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. బీమా సదుపాయం కోసం రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తమ పశువుల వివరాలు నమోదు చేయించుకుని రైతు వాటా ప్రీమియం ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని నక్కపల్లి పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ వీర్రాజు తెలిపారు.

జిల్లాలో పశు సంపద ఇలా..

నక్కపల్లి మండలంలో ఆవులు 2435, గేదెలు 11399. గొర్రెలు 17369, మేకలు 8427 ఇతర జీవాలు 46626, మొత్తం పశుసంపద 86287గా ఉన్నాయన్నారు. ఎస్.రాయవరం మండలంలో ఆవులు 7852, గేదెలు 12069, గొర్రెలు 7210, మేకలు 6723, పందులు 917, ఇతర జీవాలు 18706గా ఉన్నాయన్నారు. జిల్లా గణాంకాలు పరిశీలిస్తే ఆవులు 1.85 లక్షలు, గేదెలు రూ.2.05 లక్షలు, గొర్రెలు 1.61 లక్షలు, పందులు 0.04 లక్షలు ఉన్నాయి.

బీమాతో ఎంతో మేలు



జూన్ 1వ తేదీ నుంచి కొత్త మార్గదర్శకాలతో వైఎస్సార్ పశు బీమాను ప్రభుత్వం అమలు చేస్తోంది. రైతు కొంత మొత్తాన్ని 20 శాతం మొత్తాన్ని ప్రీమియంగా చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరించి పశువులకు బీమా చేయిస్తుంది. వ్యాధులు సోకి, ప్రమాదాలు సంభవించి పశువులు మృత్యువాత పడితే రైతు నష్టపోకుండా ఈ బీమా పరిహారం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా రైతులకు తెలియజేస్తున్నాం. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ వీర్రాజు, ఏడీ, నక్కపల్లి డివిజన్

పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం



తమలపాకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంత ఇంటి కల నేరవేర్చడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్యవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, రైతులకు రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, రైతులకు పంటల భీమా, చేతి వృత్తులు గల వారికి ఆర్థిక సాయం, వాహన మిత్ర వంటి పలు సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చిన తర్వాత 4 సంవత్సరాలు పూర్తి కాకుండానే 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విధానం, లబ్ధిదారులకు పథకాలు పొందుతున్న తీరుపై ప్రజలను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

తమలపాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

సత్యవరం గ్రామంలో తమలపాకు రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను, నష్టాలను పంటలకు సోకుతున్న తెగుళ్ళను ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రైతులు వివరించారు. తమలపాకుల ఎగుమతికి సిద్ధమగుతున్న ప్రదేశాలకు వెళ్లి ఎమ్మెల్యే తమలపాకులను పరిశీలించారు. తోటలు తెగుళ్ళు బారిన పడి ఎంతో నష్టం వస్తుందని, పంటల బీమా వర్తింపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాబూరావు రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసి లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, యగదాసు శేఖర్, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగరావు, గూటూరు వెంకటేశ్వరరావు, నాయకులు జగతా శ్రీను, గెడ్డమూరి శ్రీను, కొంతం నరేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో వలంటీర్ల విధి నిర్వహణ

ఎమ్మెల్యే బాబూరావు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : మండలంలో పనిచేస్తున్న వలంటీర్ల సేవలకు వందనం ఒక్కటే చాలదని వారిని సముచితంగా గౌరవిస్తూ వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరక గ్రామాల్లో సేవలందిస్తున్న వలంటీర్లను ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడం కోసం వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే పారితోషకం వారికి ఏ విధంగాను సరిపోదని అయితే స్వచ్ఛందంగా వారు సేవ చేయడానికే ముందుకు వచ్చారన్నారు. జగనన్న ప్రభుత్వంలో తమ పరిధిలో పలువురికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసి వారి అవసరాలు తీర్చామన్న సంతృప్తి వారిలో వ్యక్తమవుతోందన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు మంచిరోజులు వస్తాయన్నారు. వీరి సేవలను గుర్తించి ప్రస్తుతం కొంత మొత్తాన్ని నజరానాగా అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ బాబ్జి, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, పార్టీ బీసీ సెల్ నాయకులు నర్సింహమూర్తి, సర్పంచ్ అల్లు పార్వతి రమణ, ఎంపీటీసీలు గోవిందు, పక్కుర్తి రమణ, బచ్చలరాజు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్‌లు నర్సింహమూర్తి, కొండలరావు, శ్రీను, చిట్టిబాబు, వెంకటేష్, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



వాడపాలెంలో ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని తంతడి వాడపాలెంలో బుధవారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మన పూర్వీకుల నుంచి సనాతన సంప్రదాయాల్లో ఎన్ని నియమ నిష్టలు దాగి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, ఇంటింటికీ స్టిక్కర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చోడిపల్లి సత్యం, ఉమ్మిడి దుర్గాలు, వంకా బంగారయ్య, ఎరిపల్లి సత్యం, చోడిపల్లి నూకరాజు, మసేన్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో గడప గడపకు నేడు

రాంబిల్లి: జడ్.చింతువా సచివాలయం పరిధిలో గల గజిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పాల్గొంటారని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు కోరారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం



కొత్తపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: జగనన్న పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు(కన్నబాబు) అన్నారు. కొత్తపట్నం గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. చంద్రబాబు ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పథకాలకు అక్రమ వసూళ్లు చేయడంతో లబ్ధిదారులు నష్టపోయేవారని, కానీ జగనన్న పాలనలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగించేందుకు మరోసారి జగనన్నను గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన వాటర్‌ప్రూఫ్ బ్యాగులను వలంటీర్లకు అందజేశారు. కాగా కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అనారోగ్యంతో బాధపడుతున్న ఎరిపల్లి కొండబాబుకు రూ.5వేలు, చింతకాయల లక్ష్మికి రూ.10వేలు, పి.అప్పలకొండకు రూ.5వేలు తన సొంత సొమ్మును సాయంగా అందజేశారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నునపర్తిలో వలంటీర్లకు సత్కారం




వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తి సచివాలయం పరిధిలో సేవా మిత్ర అవార్డు పొందిన వలంటీర్లను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు సేవా కార్యక్రమాలను అందించడంలో వలంటీర్లు చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాము, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు నర్మాలకుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ చుక్కా అనురాధ, మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు పాల్గొన్నారు.

మెరక గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలి

నక్కపల్లి : మెరక గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే గొల్ల బాబూరావును కోరారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఆధ్వర్యంలో వారంతా గొడిచర్లలో ఎమ్మెల్యేను కలిసారు. తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో 12 మెరక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మెరక గ్రామాలకు వెళ్లే మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడం వల్ల కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడానికి సాంకేతిక ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించి తద్వారా కొత్త లైన్లు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. దీనిపై రైల్వే, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు




మునగపాకలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక-2 ఎంపీటీసీ సూరిశెట్టి రాము నిధుల ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల కమతాల్లో కూడా పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా బోర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏపీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, తంపరమూల రైతు సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల మణికంఠ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు అవగాహన అవసరం

ఎస్.రాయవరం : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. యాంటీ టీబీ డే పురస్కరించుకుని, పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సచివాలయాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్షయ వ్యాధి సోకిన వారు, రెండు వారాలకు మించి దగ్గు తగ్గకపోవడం, క్రమేణ బరువు తగ్గిపోవడం, తరచూ జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలన్నారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి



సర్వసిద్ధి పీహెచ్‌సీ నూతన భవనం పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

ఎస్.రాయవరం : పీహెచ్‌సీ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై పనులు సక్రమంగా నిర్వహించాలని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత అన్నారు. నిర్మాణం పూర్తయిన పీహెచ్‌సీ నూతన భవనాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రూ.కోటి 20 లక్షలతో నిర్మాణం చేసిన ఈ భవనం ఆధునిక హంగులు కలిగి ఉందని చెప్పారు. వారం, 10 రోజుల్లో భవనం ప్రారంభిస్తామన్నారు. తుది మెరుగులు ఏమైనా ఉంటే పనులు పూర్తి చేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియకు ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఫ్యామిలీ క్లినిక్‌తో నెలలో ఒకటి రెండు రోజులు వైద్యాధికారితో పాటు సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటున్నారని, దీనివల్ల ఇంటి వద్దకే రోగులకు వైద్యం అందుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మునగపాకలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని యలమంచిలి మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు అన్నారు. అవకాశం ఉన్న వారు వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మునగపాక పీఏసీఏస్ ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయ కన్వీనర్లు మహేష్, శ్రీనివాసరావు, పీఏసీఎస్ పూర్వపు అధ్యక్షుడు మునిలినాయుడు,మాజీ ఎంపీటీసీ పరశురామ్ పాల్గొన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ

మునగపాక : ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేట ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై ఎరువులను ఆమె బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సీజన్‌లో అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. రైతు పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. ఆర్‌బీకే ద్వారా రైతులకు 'మెరుగైన సేవలందుతున్నాయన్నారు.

యోగా మానసిక వికాసానికి దోహదం



యోగాపై సాధన చేయిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దుర్గా ప్రసాద్

మునగపాక : యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గా ప్రసాద్ అన్నారు. యోగా ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా మునగపాక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ ఉదయం కొంతసేపు నడవడం అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు మంచి స్పందన



కోటవురట్లలో విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. బుధవారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు పోటీలకు ఆసక్తి చూపారు. విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడంపై సాధన చేయించారు. రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల తెరుచుకునే సమయానికి కిట్లు అందించాలి



విద్యా కానుక కిట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండల రిసోర్స్ సెంటర్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని విద్యా కానుక కిట్లు ఎన్ని వచ్చాయో తెలుసుకున్నారు. పాఠశాలలు తెరుచుకునే సమయానికి పూర్తి స్థాయిలో కిట్లు సరఫరా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, వసతుల కల్పనలో శ్రద్ధ వహించాలన్నారు.

చెరువులు, చెక్‌డ్యామ్‌లకు ప్రారంభోత్సవం




భోగాపురంలో అభివృద్ధి చేసిన చెరువును ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఏసియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులతో అంబుజా సిమెంట్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన చెరువులు, చెక్ డ్యామ్‌లను ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ బుధవారం ప్రారంభించారు. దుప్పుతూరు, భోగాపురం, రామన్నపాలెం, ఎర్రవరం, నునపర్తి గ్రామాల పరిధిలో అభివృద్ధి చేసిన చెరువులు, తంతడిలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఏసియన్ పెయింట్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, సర్పంచ్‌లు దేశంశెట్టి శంకర్ రావు, చుక్కా అనురాధ, చోడపల్లి మురళీతో పాటు వడిశెల శ్రీనివాసరావు, ఎం.ఎస్.జువ్వాల నాయుడు, సంజీవి, పిన్నంరాజు వాసు పాల్గొన్నారు.

బాల్య వివాహం చేయాలని చూస్తే కఠిన చర్యలు

మునగపాక : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నాగులాపల్లి-1 సచివాలయ మహిళా పోలీసు భీమిశెట్టి సరోజ అన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వివాహాలు చేయడం తగదన్నారు. మండలంలోని నాగులాపల్లికి చెందిన మైనర్ బాలికకు వివాహం నిశ్చయమైందని తెలియడంతో సంబంధిత తల్లికి బుధవారం ఆమె నోటీసు అందజేసింది. మైనర్ బాలికకు వివాహం చేయాలని చూడడం తగదని, 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. అలా కాదని గుట్టుచప్పుడుగా వివాహం చేయాలని చూస్తే చట్టం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అలాగే బాల్య వివాహం ద్వారా కలిగే నష్టాలను సరోజ వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త కామేశ్వరి, పోషణ సఖి అనురాధ ఆమె వెంట పాల్గొన్నారు.

వెంకటాపురంలో రంగా విగ్రహావిష్కరణ



రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలిగిన నేత వంగవీటి రంగా అని వెంకటాపురం సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం అన్నారు. గ్రామంలో కాపు సామాజికవర్గానికి చెందిన గ్రామ పెద్దలు వంగవీటి రంగా విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపద అనేవారికి రాత్రి పగలు తేడా లేకుండా అండగా నిలిచిన నేత వంగవీటి రంగా అని కొనియాడారు.